# ఆంధ్రప్రభలో శ్రీమతి శోభానాయుడు గారి గురించి వచ్చిన ఆర్టికల్...వారి ఇంటర్వ్యూతో సహా

## అభిమానులే నాకు దేవుళ్లు

పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు అంతరంగ తరంగాలు



సిద్ధేంద్రయోగి తపఃఫలం కూచిపూడి నృత్యం. తెలుగువారికి మాత్రమే సొంతమైన విశిష్టనృత్యగీతిక. కృష్ణాజిల్లా 'మొవ్వ' సమీపంలోని 'కూచిపూడి' గ్రామంలో జనియించిన 'కూచిపూడి నృత్య ప్రక్రియ' అంతర్జాతీయస్థాయిలో కేవలం తెలుగువారిని, భారతీయులను మాత్రమే కాకుండా విదేశీయులను సైతం పరవశింపచేసి, జయజయధ్వానాలందుకుంటున్న

మహత్తరప్రక్రియ. ఈ కళ సృష్టికి యావత్ప్రపంచం చేతులెత్తి నమస్కరించి తెలుగువారికి గర్వకారణంగా నిలిచింది.

ఆధునికకాలంలోకూచిపూడి నృత్యం అనగానే, వెంపటి చినసత్యం, యామినీకృష్ణమూర్తి, శోభానాయుడు తదితరులు మన కళ్ల ముందు ప్రత్యక్షమవుతారు. కళాతపస్వి కె. విశ్వనాథ్ చెప్పినట్లు వీళ్లంతా "మన ప్రాచీన, సంప్రదాయ కూచిపూడి నృత్యం అంతరించిపోకుండా, తమ అరచేతులను అడ్డుపెట్టి, భావితరాలకు అందించేందుకు అహర్నిశలూ కృషి చేసిన మహాకళాకారులు. కళాతపస్వులు. వందల కొద్దీ, వేల కొద్దీ శిష్యులను తీర్చిదిద్ది కూచిపూడి నృత్యానికి జవమూ, జీవమూ నింపినవారు."

ప్రస్తుత అంశానికొస్తేపద్మశ్రీ శోభానాయుడు గురించి తెలియని తెలుగువారు వుండరు. కానీ, ఈ తరానికి మరొక్కసారి నృత్యరంగంలో వారి అవిరళకృషిని, అనేకసామాజికాంశాల పట్ల వారి మనోభావాలను తెలుసుకునేందుకు వెళ్లిన 'ఆంధ్రప్రభఆదివారం అనుబంధం'తో ఆత్మీయంగా తమ మనసు విప్పి ముచ్చటించిన అనేకాంశాలుఈ వారంఈ తరం కోసం.....

http://www.maganti.org/

శోభానాయుడు ఒక పక్క నాట్యకళలో సంప్రదాయాన్ని, ఉన్నతవిలువలను పరిపోషిస్తూ, వేరొక పక్క సమాజప్రయోజనంకోరి, సమాజహితవు కోరుతూ, సామాజికస్పృహ కలిగిన నాట్య రూపకల్పనలు కావిస్తున్నారు. లోతుగా, సునిశితంగా పరిశీలిస్తే కొందరు మహాకళాకారులు పుట్టుకతోనే భగవదనుగ్రహం, పసిప్రాయంలోనే 'కళ' కలిగి, మొగ్గ తొడిగిందా అనిపిస్తుంది. ఆ అంశాన్ని బలపరిచే సంఘటన చెపుతూ, "నేను ఉయ్యాలలో వుండగానే రేడియోలో పాట వస్తే, దానికి తగ్గట్టు నా కాళ్లు ఆడించేదానినట. మా అమ్మ ఆ మాటను చాలాసార్లు అందరితో అనేవారు" అన్నారు నవ్వుతూ శోభానాయుడు.

"నాలోని నాట్యకళను మొట్ట మొదట గుర్తించింది మా అమ్మగారే. నా కోసం ఆమె ఎన్నో కష్టనష్టాలను ఓర్చింది. ఆమెకు వీణావాదనంలో మంచి ప్రవేశం వుండేది. నాకు డాన్స్ నేర్పించి నాట్యరంగంలో నా భవిష్యత్తు కోసమై ఎన్నో కలలు కంటూ నా మూడవ ఏట నుంచి నన్ను నడిపించింది. ఆ క్రమంలో నన్ను తీసుకొని మద్రాసుకు మకాం మార్చుకుంది. మా నాన్నగారు హైదరాబాద్‌లో వుండేవారు. నా చిన్నప్పుడు పి.ఎల్. రెడ్డి వద్ద,

పెద్దయ్యాక వెంపటి చినసత్యం గారి వద్ద నాకు నాట్యంలో శిక్షణ ఇప్పించింది" అన్నారు, నాట్యరంగంలో తన ప్రవేశం గురించి చెపుతూ.

శోభానాయుడు చక్కటి నాట్యకళాకారిణి మాత్రమే కాదు. మంచి ఉపాధ్యాయిని కూడా. 1980లో భాగ్యనగరం ఇందిరాపార్క్ సమీపంలో, ఎన్టీఆర్ స్టేడియం ఎదురు వీథిలో కూచిపూడి ఆర్ట్ అకాడమీ స్థాపించి వందలకు పైగా శిష్యులను తీర్చిదిద్దారు. వీరంతా దేశవిదేశాలలో ప్రదర్శనలివ్వడమే కాకుండా సొంతంగా డాన్స్ ఇన్స్టిట్యూట్ నెలకొల్పి ఎంతోమంది కళాకారులకు నాట్యశిక్షణ ఇస్తున్నారు.

ఇక శోభానాయుడు పోషించిన పాత్రలను అవలోకిస్తే... ఒక్కొక్కటి ఒక్కో ఆణిముత్యంగా కళాభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేసినవే. సిద్ధేంద్రుని కలల పంట సత్యభామగా ఆమెకు ఆమే సాటి. రవీంద్రనాథ్ ఠాగూర్ 'చండాలిక'గా ప్రేక్షకుల హృదయాలను ద్రవింపచేసింది. 'కళ్యాణశ్రీనివాసం'లో పద్మావతిగా, 'విప్రనారాయణ'లో దేవదేవిగా, 'మేనకావిశ్వామిత్ర'లో మేనకగా, 'శ్రీకృష్ణశరణం మమ'లో శ్రీకృష్ణుడుగా, 'విజయోస్తుతే నారీ'లో దుర్గామాతగా, 'క్షీరసాగరమథనం'లో బలిచక్రవర్తిగా, మోహినిగా,

http://www.maganti.org/

'సర్వం సాయిమయం'లో సాయిబాబాగా, త్యాగరాజ రామాయణం 'జగదానందకారక'లో శ్రీరాముడుగా, స్వామి వివేకానందుడుగా ఇలా.... ప్రతి పాత్రలో పరకాయప్రవేశం చేసి నృత్యనాటికల విజయపరంపరతో కీర్తిసోపానాన్ని అధిరోహిస్తున్నారు. భగవద్గీత ఆధారంగా ఆమె రూపొందించిన 'సంభవామి యుగే యుగే' నృత్యరూపకల్పన ఆమె అనన్యప్రతిభకు తార్కాణం. ఈ మధ్య రూపొందించి, ప్రదర్శించిన 'నవరసనటభామిని' ఆమె నృత్య రచనాప్రతిభకి అద్దం పట్టింది.

శోభానాయుడు భారతదేశంలోని ప్రధాననగరాలలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చి రసహృదయుల కరతాళధ్వనులందుకుంటూ విజయయాత్రలు చేశారు.

వారు అందుకున్న బిరుదులు ఎన్నో.... ఎన్నెన్నో..... శ్రీకృష్ణ గానసభ, చెన్నై వారు 'నృత్యచూడామణి', కేంద్ర సంగీత నాటక అకాడమీ 'సంగీత నాటక అకాడమీ అవార్డ్', బాంబే సుర్ శృంగార్ సంసద్ 'నృత్య విహార్', ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 'ఎన్‌టిఆర్ అవార్డ్', 'హంస' అవార్డ్, తిరుపతి సంగీత సభవారు 'సప్తగిరి సంగీతవిద్వన్మణి' అవార్డులను, బిరుదులను ఇచ్చి సత్కరించారు.

శోభానాయుడు కూచిపూడి నృత్యానికి చేసిన సేవను గుర్తిస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్‌నిచ్చి సత్కరిస్తే, కేంద్ర ప్రభుత్వం వారు ప్రతిష్ఠాత్మకమైన 'పద్మశ్రీ' బిరుదుతో గౌరవించారు.

నాట్యకళాకారిణిగా మాత్రమే కాక, సామాజికస్పృహ కల్గిన సంపూర్ణకళాకారిణిగా అనేకసందేహాలను ఆమె ముందుంచితే తగు విధంగా స్పందించారు.

కూచిపూడి నృత్యం తెలుగువారి జీవితాలలో ఇంతగా మమేకం అవడానికి కారణాలు ఏమై వుంటుందని మీరు భావిస్తున్నారు?

"కూచిపూడి నృత్యం ఆవిష్కర్త సిద్ధేంద్రయోగి మన తెలుగువారు అవడం ప్రధానకారణం. సత్యభామ పాత్రను, వ్యక్తిత్వాన్ని విశ్వరూపంగా చూపిన 'భామాకలాపం'తో మొదలై తరంగం, దశావతారాలు, అష్టపదులు, తిల్లానాలతో మన ఇతిహాసాలను, పురాణాలను కళ్ల ముందు నిలబెట్టడం వల్ల ప్రేక్షకులు తన్మయులవుతారు.  "ఈ రూపకాలు ప్రేక్షకుల్లో బాగా నాటుకుపోయాక, సరి కొత్త అంశాలను చేరుస్తూ కూచిపూడి సిలబస్‌ను మరింత సృజనాత్మకతతో, అన్నమయ్య, త్యాగయ్య,

పురందరదాసుల కీర్తనల ఆధారంగా మరి కొన్ని నృత్యాలు సృష్టించారు. ఈ విధంగా కూచిపూడి నృత్యం తన పరిధిని పెంచుకుంటూ, నిరంతరం మార్పులతో, కృష్ణవేణి నదిలా మంద్రంగా, సజీవంగా సాగిపోతోంది. అయితే ఈ ప్రక్రియలన్నిటినీ ఆమోదించి, అభిమానించే ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు. నా అభిమానులే నాకు దేవుళ్లు!"

విదేశాలలో ఈ నృత్యానికి ఆదరణ ఎలా వుంది?

"అరబ్ దేశాలలో గాని, రష్యన్స్, స్పానిష్ ప్రజలకు, మన పురాణాల గురించి తెలియనప్పటికీ నృత్యరూపకాలన్నిటినీ ఆసాంతమూ సీట్లోంచి కదలకుండా చూసి, చివర్లో స్టాండింగ్ ఓవియేషన్ ఇస్తారు. అంతే కాదు, ప్రదర్శన అయిపోయాక, గ్రీన్ రూమ్‌లోకి వచ్చి తమని పరిచయం చేసుకుని, వస్త్రధారణ గురించి, ఆభరణాలు, అలంకారాల గురించి, ప్రతి చిన్న అంశాన్నీ వివరంగా అడిగి, సందేహాలను తీర్చుకుంటారు. మన భారతీయ సంస్కృతి అంటే వారికి ఎంతో అభిమానం."

మీరు ఎన్నో దేశాలు చూశారు కదా? మీకు నచ్చిన దేశం?

"మన డాన్స్‌ను ఆదరించడంలో అమెరికనులు ముందుం టారు. చూడడానికైతే మాత్రం పారిస్ నగరం ఎంతో బావుంటుంది. కాని నిజం చెప్పాలంటే విదేశాల్లో ఇచ్చిన ప్రదర్శనలకి వచ్చినంత స్పందన ఇక్కడ రాదేమో అనిపిస్తుంది."

ఈ తరం యువత కూడా ఆరాధించేంత అందంగా వుంటారు. మీ గ్లామర్ రహస్యం?

"ప్రతి ఉదయం యోగా, మెడిటేషన్, పూజ చేస్తాను. టైమ్‌కి ఆహారం తీసుకుంటాను. వీటితో పాటు నా మనసుని నిర్మలంగా వుంచుకుంటాను. అసూయాద్వేషాలకు చోటివ్వను. మనసు మీదే అన్ని ప్రభావాలూ పడతాయి. కనుక 'మనసు ప్రధానం' అని నమ్ముతాను."

మీ హాబీలు?

"పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. భగవద్గీత, సుధామూర్తి గారి సాహిత్యం, సైకాలజీ పుస్తకాలు ఇష్టం. ప్రముఖస్వాముల ప్రసంగాలు వింటుంటాను. ఇంట్లో వంట స్వయంగా చేసుకుంటాను.

గార్డెనింగ్ చేస్తాను. ముఖ్యంగా పెయింటింగ్స్ వేయడం నాకు ఎప్పట్నుంచో అలవాటు. నేను గీసిన పెయింటింగ్స్ చాలా వున్నాయి."

ప్రభుత్వం కూచిపూడి నృత్యానికి ఇంకా ఏ విధంగా సహకారం అందిస్తే బావుంటుందనుకుంటున్నారు?

"ప్రతి నగరంలోనూ డాన్స్ ఫెస్టివల్స్ నిర్వహించాలి. వారి వారి అనుభవం, అర్హతలను బట్టి ఇన్స్టిట్యూట్స్ పెట్టేందుకు ముందుకొస్తే ఆర్థికంగా చేయూతనివ్వాలి. బీదపిల్లలకి స్కాలర్షిప్స్ ఇవ్వాలి. స్కూల్స్‌లో, కాలేజెస్‌లో, డాన్స్ సబ్జెక్ట్ తప్పని సరిగా ప్రవేశపెట్టాలి."

ముఖ్యంగా మీ సొంత సంస్థ కూచిపూడి ఆర్ట్ అకాడమీ విద్యార్థులకు ఏ విధమైన సహకారం అందిస్తోంది?

"నామమాత్రపు ఫీజ్ 100 రూపాయలు తీసుకుంటున్నాము. వారం రోజులూ క్లాసులుంటాయి. నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తిగల పేద విద్యార్థులు 30 మందికి ఉచితంగా నేర్పిస్తున్నాము. నృత్యంతో పాటు సంగీతం, యోగా, పెయింటింగ్, థియరీ చేస్తున్నాం. ప్రస్తుతం 120 మంది విద్యార్థినులున్నారు."

మీరు చేస్తున్న సేవాకార్యక్రమాలు వివరించండి.

"అవకాశం వున్నప్పుడల్లా 'ఓల్డ్ ఏజ్ హోమ్' కెళ్లి వారితో నా సమయాన్ని వెచ్చిస్తాను. నా నుంచి కావలసినంత మేరకు సహాయం చేస్తాను. మా స్టూడెంట్స్‌తో హైదరాబాద్ నగరంలో పలు 'ఓల్డ్ ఏజ్ హోమ్స్'లో ప్రదర్శనలు ఇప్పించాను. వారు ఎంతగానో మా స్టూడెంట్స్‌ని ప్రశంసించేవారు. వారి జీవితాల్లో అదొక మధురానుభూతిగా చెప్తోంటే వ్యక్తిగతంగా సంతోషం వేసింది. నా అభిమానులందరూ ఇలాంటి సేవాకార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను."

మీ సక్సెస్‌కి కారణం ఏమైవుంటుందని మీరు భావిస్తున్నారు?

"ముఖ్యంగా మా అమ్మగారు. మా నాన్నగారికి దూరంగా వుంటూ మాద్రాస్ నగరంలో నాతో వుండి నాట్యంలో శిక్షణ ఇప్పించడం. మా నాన్నగారి అభిమానం, నా గురువుల ఆశీర్వాదం. అభిమానుల ఆదరణ కారణమని భావిస్తాను."

మీరు అభిమానించే నృత్యకళాకారులు?

"బాలసరస్వతి. పద్మాసుబ్రహ్మణ్యం, యామినీకృష్ణమూర్తి."

http://www.maganti.org/

మీ భవిష్యకార్యక్రమాలు?

"ఇంకేముంటాయి? నా నృత్యానికి సంబంధించినవే. మా అకాడమీ వాద్యకళలని ప్రవేశపెట్టాలి. ఇతరదేశాలు, ఇతరరాష్ట్రాల నుండి వచ్చినవారికి వసతి సౌకర్యాలుండే హాస్టల్ నిర్మించాలి. ప్రతి విద్యార్థినికి ఉపయోగపడేటట్లు పుస్తకాల లైబ్రరీ, ఆడియో, వీడియో లైబ్రరీ ఏర్పరచాలి. చిన్న చిన్న ప్రదర్శనలకు అనువుగా ఉండేటట్లు ఒక చిన్న థియేటర్ నిర్మించాలి. ఇలా ఎన్నో కలలు.... ఆ భగవంతుని కృపాకటాక్షాలతో, నెరవేరాలని ప్రార్థిస్తున్నాను" అంటూ తమ ఇంటర్వ్యూని ముగించారు డా. శోభానాయుడు.

- వేములపల్లి శంకరరావు